క్లుప్తంగా

ఎకరాకు 43 బస్తాల దిగుబడి

తుని రూరల్: మెట్ట ప్రాంతమైన డి.పోలవరంలో అంచనాలకు మించి వరి పంట దిగుబడి లభించిందని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. డి.పోలవరం గ్రామానికి చెందిన బొడ్డేటి కుమారి అనే రైతు పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటను కోసి తూకం వేయగా 20 కిలోలు దిగుబడి వచ్చిందన్నారు. ఈ లెక్కన ఎకరాకు 43 బస్తాల దిగుబడి లభించినట్టు అంచనా వేశామన్నారు. కాగా రైతు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఎంటీయూ 1064 రకం ధాన్యం పండించినట్టు ఏఓ వివరించారు. ఏఈఓ పి.జగ్గ అప్పారావు, వీఏఏలు శ్రీను, లోవరాజు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆర్థిక సాయం



ధర్మవరంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో పలు బాధిత కుటుంబాలను శుక్రవారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన జువ్వల శేఖర్, జువ్వల దేవిడ్ రాజు కుటుంబాలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారిలో శేఖర్ కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పాగనాటి వెంకటేశ్వరరావు, కుప్పిన శ్రీను, గొనగాల గోపి, జువ్వల దొరబాబు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సాయి హాస్పటల్ క్యాలెండర్‌ను టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. నాయకులు జ్యోతుల నవీన్, మారిశెట్టి భద్రం, ముండ్రు యర్రబాబు, బుర్రి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని 108 కలశాల పంచామృతాలతో స్వామి, అమ్మవార్లు, పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. తొలుత పంచామృతాల కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ (ఊరేగింపు) చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కోటనందూరు: మండలంలోని అప్పలరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళ రక్షక్ బీట్ కార్యక్రమంలో భాగంగా ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లల పాత్ర, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాఠశాల లోపల, బయట ఏ సమస్య ఎదురైనా వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

శంఖవరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ కొండా ప్రవీణ సిబ్బందికి సూచించారు. మండలంలోని డి.మల్లాపురం, డి.పోలవరం, మాసంపల్లి, అచ్చంపేట, జి.కొత్తపల్లి, శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు తొలగించడం దారుణం

గోకవరం: గ్రామంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను శాంతియుతంగా పోస్టర్ల రూపంలో తెలియజేస్తే వాటిని అధికారులు తొలగించడం దారుణమని గుమ్మళ్లదొడ్డి గ్రామస్తులు అన్నారు. గ్రామంలో శుక్రవారం రామాలయం వద్ద గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. నల్లజెండాలతో కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వలన పడుతున్న ఇబ్బందులు రోజురోజుకు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో విధించిన ఆంక్షలను ఫ్యాక్టరీకి కాకుండా కేవలం గ్రామస్తులకు పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. తమపై ఆంక్షలు ఆపి, సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 28వ తేదీన గ్రామంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

శరవణ భవ!

- నేడు సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి
- సుందరంగా ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఏలేశ్వరం: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం స్వామివారి షష్ఠిని పురస్కరించుకుని ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో షష్ఠి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఏలేశ్వరం సాయిబాబా మెట్ట మీద గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అర్చకుడు ఐలూరి సాయి ఆధ్వర్యంలో తెలవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఎంతో విశిష్టత కలిగిన ఆలయం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఆలయం వద్ద పలు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. యర్రవరంలో షష్ఠి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



కాత్రావులపల్లిలో తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ఏలేశ్వరం సాయిబాబా మెట్టపై గల సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి పాటు పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. కొందరు భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేస్తారు. మరికొందరు ఇళ్ల వద్ద నుంచి టిఫిన్ తెచ్చుకుని తింటారు.

షష్ఠి తిరునాళ్లకు బందోబస్తు ఏర్పాటు

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లిలో శనివారం జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం బందోబస్తు ఏర్పాట్లను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయన వెంట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఉన్నారు.

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో సుందరగిరి కొండపై వేంచేసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలకు ఘనంగా



ఏలేశ్వరంలో షష్ఠి ఉత్సవాలకు ముస్తాబైన స్వామివారి ఆలయం

ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి ఈ నెల 12 వరకు ఆలయంలో షష్ఠి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కిర్లంపూడి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను మండలంలోని రామచంద్రపురం, కిష్టవరం, చిల్లంగి గ్రామాల్లోని స్వామివారి ఆలయాలు సుందరంగా ముస్తాబు అయ్యాయి. రామచంద్రపురంలో వేంచేసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సుమారు 30 వేల మందికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేసినట్టు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తెలిపారు.

సుబ్బారాయుడు పెళ్లి కొడుకాయెనె..

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ వద్ద శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి షష్ఠి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 4 గంటలకు వల్లీ, దేవసేన అమ్మవార్లు, సుబ్రహ్మణ్యస్వామికి పండితులు ప్రత్యేక పూజలు చేసి వధూవరులను చేశారు. ముత్తయిదువులు శుభం కోరుతూ పసుపు దంచారు. భక్తులకు ప్రసాదాలు, ముత్తయిదువులకు తాంబూలాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నవర పురవీధుల్లో స్వామి, అమ్మవార్లను శేష, మయూర వాహనాలపై మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించారు.



అన్నవరంలో స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసి పూజలు చేస్తున్న పండితులు

నేడు స్వామివారి కల్యాణం

షష్ఠి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి, అమ్మవార కల్యాణం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

17న పెన్షనర్లకు సత్కారం

ప్రత్తిపాడు: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న 80 ఏళ్లు దాటిన విశ్రాంత ఉద్యోగులను సత్కరించనున్నట్టు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విశ్రాంత ఉద్యోగి 2025 ఫిబ్రవరి 28వ తేదీ లోగా లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. పెన్షనర్లకు రావలసిన కరువు భత్యం, బకాయిలు, మధ్యంతర భృతిని ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు యలమంచిలి రామం, జంధ్యం సుబ్బారావు, ఎం.సుబ్రహ్మణ్యం, ఎ. శేషగిరిరావు, బాదంపూడి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారులో పేకాట శిబిరంపై స్థానిక ఎస్సై టి. రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు.

ధార్మిక ప్రచార రథాన్ని దర్శించుకున్న భక్తులు

జగ్గంపేట: స్థానిక రావులమ్మతల్లి ఆలయం వద్దకు శుక్రవారం వచ్చిన ధార్మిక ప్రచారం రథాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారు, మల్లికార్జునస్వామి విగ్రహాలతో కూడిన ఈ ప్రచారం రథానికి టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు ఘన స్వాగతం పలికారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ అర్చకులతో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వి.కొత్తూరు కేజీబీవీలో కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

తుని రూరల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆఫీసర్ పి.వేణుగోపాలరావు సూచించారు. తుని మండలం వి.కొత్తూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సంపూర్ణ విద్య (హోలిస్టిక్) ప్రోగ్రాస్ కార్డులు, ఆర్వో ప్లాంట్, వంటగది, మెనూను తనిఖీ చేశారు. ఇంటర్ విద్యార్థినుల కోసం నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. మెగా పేరెంట్ మీటింగ్ నిర్వహణపై ప్రిన్సిపాల్ అమృతవాణికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్‌లో మంచి మార్కులతో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థినులను సన్నద్ధం చేయాలన్నారు. అవసరమైన మౌలిక వసతుల కల్పిస్తామని తెలిపారు. జిల్లా బాలికా సంరక్షణ అధికారి ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి

తొండంగి: కేజీబీవీల్లో శనివారం నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కేజీబీవీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు సూచించారు. మండలంలోని వాకదారిపేట కేజీబీవీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఎస్‌ఓ రాంబాబు, ఎస్‌ఓ రాజేశ్వరి ఉన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఓ రాంబాబు, ఎంఈవో షేక్‌బాబ్జి, ఎస్‌ఓ రాజేశ్వరీ ఉన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని ఇ.గోకవరంలో సారా స్థావరాలపై శుక్రవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు 70 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేసినట్టు సిటీ వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు తెలిపారు. పరీక్షలు చేయించుకున్న రోగులకు వెల్లుల్లి, అల్లం, తేనె, తమలపాకు కిళ్లీ, బార్లీ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు ఎల్.అప్పారావు, కోశాధికారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి వెంకటేష్, కె.భీమరాజు, ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రక్త దాతలకు సత్కారం



తునిలో రక్తదాతలను సత్కరిస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: ఆపద సమయంలో రక్తదానం చేసి ఆదుకున్న పలువురు దాతలను అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక కొత్తపేట సీతారామా యోగా సెంటర్లో శుక్రవారం సాయంత్రం అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో తుని, పాయకరావుపేటకు చెందిన తొమ్మిది మంది దాతలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలయన్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కె.భీమరాజు, నెల్లిపూడి రాజబాబు, ఆంజేయ ప్రసాద్, నూకయ్యశెట్టి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని కారు నుంచి బయటకు తీస్తున్న స్థానికులు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడకు చెందిన జీజీహెచ్ విశ్రాంత ఉద్యోగి కాండ్రేగుల బంగార్రాజు కారులో ధర్మవరం వెళ్లి అక్కడ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరారు. మండలంలోని జెడ్.రాగంపేట యూనియన్ బ్యాంక్ వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న గ్రిల్స్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బంగార్రాజు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుకున్న క్షతగాత్రుడిని కార్తికేయ మల్టీస్పెషాలటీ హాస్పటల్ సిబ్బంది, స్థానికులు బయటకు తీసి సపర్యలు చేశారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మండలాభివృద్ధే లక్ష్యం పని చేయాలి

- ఎంపీపీ లగుడు శ్రీనివాసు
- కోటనందూరులో మండల సమావేశం

కోటనందూరు: మండలాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచి రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న తీరుపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఏలేశ్వరం: స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం. సత్యనారాయణ, ఎంఈఓ అబ్బాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. దివ్యాంగుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భవితకేంద్రంలో కంప్యూటర్, ఆటపాటలు, చదువు, యోగా నేర్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు లక్ష్మీతులసి, వెంకటరమణ, సుమలత, ఏసుబాబు, ఫిజియోథెరపిస్టు దివ్యమేఘన, కేంద్రం టీచర్లు వాణి, బుజ్జి పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ సత్యనారాయణ

మండలాభివృద్ధికి కృషి

గోకవరం: మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు నూతన గృహాలు మంజూరు చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. దీనిపై హౌసింగ్ ఏఈ రమేష్ మాట్లాడుతూ అర్హులు తమ వివరాలను గృహ నిర్మాణశాఖకు అందజేస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. కోతుల సంచారాన్ని నియంత్రించడానికి అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. దీనిపై అటవీశాఖాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోతుల సంచారం ఉన్న గ్రామాల్లో ఆయా పంచాయతీల ద్వారా తీర్మానాలు చేస్తే తాము తక్షణమే కోతులను నియంత్రించడానికి తగిన చర్యలు చేపడతామన్నారు. ఎంపీపీ శ్రీవల్లి మాట్లాడుతూ రూ.కోటి నిధులతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం, పీఆర్‌జేఈ అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.



గోకవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవల్లి

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్



ఏలేశ్వరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రత్తిపాడు కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి భాను, బార్ ప్రతినిధులు

- వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

ఏలేశ్వరం/తుని రూరల్/కిర్లంపూడి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/జగ్గంపేట/తొండంగి/రౌతులపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరం పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. పార్టీ నేతలు పైల విజయ్‌కుమార్, పతివాడ జగదీష్, కావలి శ్రీను, చందక కిరణ్, సామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తుని, తొండంగి మండలాల్లో...

తుని మండలంలోని హంసవరం, తేటగుంట గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. హంసవరంలో సర్పంచ్ రాయి మేరీఅవినాష్, జై భీమ్ మాల మహానాడు వ్యవస్థాపకులు తంతటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కిర్లంపూడి ఎస్సీపేటలో అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు మాలమాలలు వేసి నివాళులర్పించారు. తొండంగి మండలంలోని ఎ.కొత్తపల్లి, ఏవీ నగరం, బెండపూడి, కొత్తపాకలు, కోదాడ తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శృంగవృక్షంలో అంబేడ్కర్ విగ్రహానికి జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతటి కిరణ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాల్లో...

ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. న్యాయమూర్తి కాటం భాను అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పత్తిపాడులోని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) కార్యాలయంలో ఐలాజ్ రాష్ట్ర హడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధర్మవరంలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్గంపేటలో అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నేతలు రావుల గణేష్, కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, పోట్రు వీర్రాజు, జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు. రౌతులపూడి మండలంలోని అంబేడ్కర్ విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, జైభీమ్ యూత్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



హంసవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సర్పంచ్, నాయకులు

ముద్రగడ గిరిబాబుతోనే మా ప్రయాణం

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబుతోనే మా ప్రయాణం అని ఆ పార్టీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ రామిశెట్టి బుల్లిరామకృష్ణ (నాని) అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముద్రగడ, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కొప్పన వెంకన్నబాబు, ఎంపీటీసీ సాధనాల అప్పారావు, సొసైటీ మాజీ చైర్మన్ కొప్పన గంగారావు, కొప్పన నాయుడు, రామకుర్తి వీరభద్రరావు, పలివెల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలిసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు శుక్రవారం ప్రత్తిపాడులో ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేశారు. కంచాలు వాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ జీడిపిక్కల పరిశ్రమ మూసివేసిన నాటి నుంచి 21 రోజులుగా వివిధ రూపాలలో కార్మికులు ఆందోళన చేపడుతున్న యాజమాన్యం స్పందించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తదితర అధికారులకు వినతులు అందించినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం జీడిపిక్కల పరిశ్రమను తెరిపించి, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘ నాయకులు అనిశెట్టి వీరబాబు, సీహెచ్ గోవిందు, ధర్మాజీ, ఆది, రామదుర్గ, ఎస్.జయలక్ష్మి, అన్నపూర్ణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.